పర్యాటకం.. పరిహాసం


ప్రారంభానికి నోచుకోని మ్యూజియం భవనం


నిరుపయోగంగా మారిన శ్రీరామకొండ అతిథిగృహం

- భవన నిర్మాణాలు పూర్తయినా పదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని టూరిజం అధికారులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన కోయిల్‌కొండ ఖిల్లా, మహిమాన్వితమైన శ్రీరామ కొండ క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రూ.1.18కోట్లు గతంలోనే ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వాటితో ప్రారంభించిన భవనాల నిర్మాణాలు పూర్తయి పదేళ్లు గడిచినా నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందిన ఖిల్లాను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 2013లో మ్యూజియం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.33 లక్షల నిధులు మంజూరు చేసింది. ఖిల్లా వద్ద ఏర్పాటు చేసిన మ్యూజియంలో చారిత్రక అంశాలకు సంబంధించిన విశేషాలను సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం అందుబాటులో ఉంచుతామని పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. కానీ విషయంలో అధికారుల అలసత్వం కొనసాగుతోంది. ఫలితంగా భవన ప్రారంభానికి మోక్షం దక్కడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. భవనం పూర్తయి పదేళ్ల గడిచినా ప్రారంభానికి నోచుకోలేదని అంటున్నారు.

శ్రీరామకొండ వద్దా అదే పరిస్థితి

మహిమాన్వితమైన శ్రీరామకొండ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రాల్లో ఒకటి. ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు కల్పించాలని ప్రభుత్వం రూ.85లక్షలు మంజూరు చేసింది. కాగా ఈ నిధులతో ఒక అతిథిగృహాన్ని మాత్రమే నిర్మించి వదిలేశారు. కొండపై పలు అభివృద్ధి పనులు జరుగుతాయన్న ప్రజల కల కూడా నెరవేరలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలను ప్రారంభించి పర్యాటక శోభ తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రూ.కోట్లతో పర్యాటక భవనాలు నిర్మిస్తే వాటిని ప్రారంభించడంలో టూరిజం, పురావస్తుశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ భవనాలను ప్రారంభిస్తే కోయిల్‌కొండ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి. భవనాలను ప్రారంభించాలి.

– పి.నాగేశం, కోయిల్‌కొండ

వెంటనే ప్రారంభించాలి



కోయిల్‌కొండ ఖిల్లా వద్ద మ్యూజియం భవనం, శ్రీరామకొండక్షేత్రం వద్ద అతిథిగృహాలను నిర్మించినా ఎలాంటి ప్రయోజనం లేదు. భవనాలు పూర్తయి సంవత్సరాలు గడిచిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. వెంటనే ప్రారంభించాలి.

– నాగరాజు, కోయిల్‌కొండ

క్లుప్తంగా

నకిలీలను అడ్డుకోవాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 5వవార్డు ఎర్రగుట్ట వద్ద నకిలీ పత్రాలతో ప్లాట్లు ఇస్తామని చేస్తున్న చర్యలను అడ్డుకోవాలని కౌన్సిలర్ నవనీత సోమవారం తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కొందరు దళారులతో కలసి ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని, వాస్తవానికి వాటిని గతంలోనే కేటాయించారని వివరించారు. అలాగే ఎర్రగుట్ట వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వందశాతం ఫలితాలు రాబట్టాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా డీఈఓ రవీందర్ ఉత్తమ అధికారిగా ప్రశంస అందుకున్న నేపథ్యంలో టీపీఆర్టీయూ నాయకులు సోమవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. క్రమశిక్షణ సంఘం చైర్మన్ యుగంధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్, నాగిరెడ్డి, జయపాల్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



మిడ్జిల్: బైరంపల్లి సమీపంలోని దుందుభీ వాగు నుంచి సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొన్నారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు మాట్లాడుతూ పట్టుబడిన ట్రాక్టర్లలో రెండు జడ్చర్ల పరిధిలోని గంగాపూర్‌కు చెందినవని.. మరోటి గుర్తించవలసి ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుమారుడితో సహా వివాహిత అదృశ్యం

మహమ్మదాబాద్: మండల పరిధిలోని పగిడ్యాల్‌లో ఓ వివాహిత తన రెండేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైందని మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు. సోమవారం ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన మహిళ గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమవివాహం చేసుకుందని.. సదరు వ్యక్తి మరో మహిళను పెళ్లి చేసుకుని గ్రామంలో కాపురం పెట్టాడని తెలిసింది. ఈమేరకు వారిపై మహిళ తల్లి అనుమానం వ్యక్తం చేసిందని పోలీసులు పేర్కొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులపై కేసు

మహమ్మదాబాద్: మండలపరిధిలోని జిన్నారం గ్రామానికి ఓ మహిళతో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించడంపై మహమ్మదాబాద్ పోలీసులు సోమవారం కేసునమోదు చేశారు. తమ ఇంటి ఖాళీ స్థలంలో నిర్మించిన బాత్‌రూం వద్ద ఉన్న మహిళపై చిన్నబుగ్గయ్య, రవి, మోహన్, రమేష్, బాలు, ఆనంద్ దాడిచేసి ఒంటిపై దుస్తులు చించి అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఈమేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

అడ్డాకుల: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని మూసాపేట ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని వేముల రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు సూచనలు చేశారు. ఏఎస్ఐ శివారెడ్డి, కానిస్టేబుళ్లు నారాయణ, కుర్మయ్య ఉన్నారు.

గుంతలమయంగా ఇంటర్నల్ రహదారి

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తా నుంచి జడ్చర్ల వైపు వెళ్లే ఇంటర్నల్ రహదారి గుంతలుగా మారడంతో పట్టించుకొనే వారు కరువయ్యారు. చౌరస్తాలోని బ్రిడ్జి వద్ద ఇంటర్నల్ రహదారి మూడు వైపులా బీటీ రోడ్డు పనులు దాదాపు మూడు నెలల క్రితమే చేపట్టారు. కాగా జడ్చర్ల వైపు వెళ్లే రహదారిపై మాత్రం బీటీ వేయకుండా వదిలేశారు. పట్టణ ప్రజలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇప్పటికైనా చొరవ తీసుకోని ఎల్‌అండ్‌టీ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టేలా చేయాలిని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సాదాసీదాగా సాగింది. సర్పంచులు పదవీకాలం ముగుస్తుండడంతో అనుభవాలను సభలో పంచుకున్నారు. అనంతరం అధికారులు ఎజెండాలు చదివి వినిపించారు. కాగా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు ఏ ఖాతాలో వేస్తున్నారో తెలియక వారు అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని అప్పంపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి నిలదీశారు. కాగా ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏపీఓ నవీన్ తెలిపారు. నిర్దేశించిన చోట కాకుండా ఒక రైతు సౌలభ్యం కోసం ఎర్ర కాల్వకు అడ్డంగా చెక్‌డ్యాం నిర్మాణం సరికాదని కొందరు సభ్యులు ఆరోపించారు. చాలామంది రైతులు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఉంద్యాలలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణం పనులు ముందుకు సాగడంలేదని ఎంపీటీసీ నెల్సన్ తెలిపారు. త్వరగా పూర్తి చేయాలని కోరారు. వేసవిలో మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు మంచినీటి కొరత లేకుండా చూస్తామని ఏఈ రఘు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చూడాలన్నారు. జెట్పీటీసీ వట్టెంరాజేశ్వరి, కో–ఆప్షన్ మెంబర్ మహిమూద్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దశరథ్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అడ్డాకుల: మండల కేంద్రంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజుల తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సభకు విధిగా హాజరు కావాలని సూచించారు.

పరీక్షా పే చర్చ వీక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ కేంద్రీయ విద్యాలయంలో సోమవారం పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్ విధానం ద్వారా విద్యార్థులకు చేసిన సూచనలు శ్రద్ధగా విన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

గండేడ్: పీఏసీఎస్ చైర్మన్‌గా కమతం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు అవిశ్వాస తీర్మానం వల్ల బాధ్యతలకు దూరమైన ఆయన కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఉత్తర్వులు రావడంతో సోమవారం తిరిగి చైర్మన్ అయ్యారు. ఈమేరకు సీఈఓ ఆశన్న, డైరెక్టర్‌లు బాలస్వామి, దశరథ్ తదితరులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ మారడంతోనే అవిశ్వాసం ప్రవేశపెట్టడం ఎంతవరకు సమంజసం అని.. అయినా న్యాయమే గెలిచిందని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణలు పేర్కొన్నారు. శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అనంతలక్ష్మారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

భూత్పూర్: ఎల్కిచర్లకి చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి తల్లి రాంచంద్రమ్మ ఇటీవల మృతిచెందగా బాధితకుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నారాయణ గౌడ్, నర్సింహులు గౌడ్, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడగించాలి

నారాయణపేట: ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడగించాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలంలో గ్రామాలు అభివృద్ధి చెందాయనేదానికి ప్రతి గ్రామంలో దర్శనమిస్తున్న పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ దామాలు, ఇంటింటికి మిషన్ భగీరథ తాగునీరు, చెత్త తొలగింపుకు ప్రతిగ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, గ్రామంలో సీసీరోడ్లు సీసీ డ్రైనేజీలు నిదర్శనమన్నారు. అంతేకాకుండా సర్పంచ్‌లు చేపట్టిన వివిధ పనులకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. స్పెషల్ అధికారులకు బదులుగా సర్పంచ్‌లకు పొడగింపు బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ పోటీలు



నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో ఆరురోజులుగా నిర్వహిస్తున్న మహంకాళి ప్రీమియర్ లీగ్ మూడో సీజన్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొదట బ్యాటింగ్‌చేసిన పవర్ హిట్లర్స్ 10ఓవర్లో 97పరుగులు లక్ష్యాన్ని నిర్దేశించగా సూపర్ సిక్సర్ జట్టు చివరి బంతి వరకు ఎంతో టెన్షన్ మధ్య విజయం సాధించారు. విన్నర్, రన్నర్‌లకు ఆర్ఎస్ఎస్ నాయకులు కురుమన్న, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఏర్పాటు


రాచాలలో బూత్ కమిటీలను అభినందిస్తున్న సర్పంచ్ తిరుపతయ్య

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ యూత్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. రాచాలలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 51వ బూత్‌నకు భాస్కర్, 52కు శ్రీనివాసులు, 53కు వి.శ్రీనివాసులు, 54కు రాజు, ముత్యాలంపల్లిలో 160కి భరత్‌కుమార్‌ను ఎంపిక చేశారు. సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్, విండో డైరెక్టర్ బుచ్చన్నగౌడ్, అనిల్, రాంరెడ్డి, రాంనర్సింహ తదితరులు ఉన్నారు.

కొమిరెడ్డిపల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. 59వ బూత్‌నకు బగ్గి లక్ష్మణ్, 60కి బోయ వెంకటేష్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలరాజు, సీనియర్ నాయకుడు నిరంజన్ తదితరులు ఉన్నారు.

కౌకుంట్లలో..

దేవరకద్ర: కౌకుంట్ల గ్రామ కాంగ్రెస్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కిషన్‌రావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కౌకుంట్ల అధ్యక్షుడిగా ప్రభు, ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు. బీసీ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నాగన్న, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయాదవ్, యూత్ అధ్యక్షుడిగా రాకేష్‌సాగర్, ఉపాధ్యక్షుడి రమేశ్‌యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడి నజీర్, ఉపాధ్యక్షుడిగా వలియోద్దీన్ తదితరులు ఎన్నికయ్యారు.

‘ఆధార్ అప్‌డేట్ చేయి సారూ’



నవాబుపేట: ‘మా ఆధార్‌కార్డు అప్‌డేట్, ఫోన్‌నంబర్ లింక్ చేయవా సారు’ అంటూ గ్రామాల్లో ఎవరినోట విన్నా ఇదే మాట వినిపిస్తోంది. నిత్యం ఆధార్ కేంద్రాలకు జనం క్యూకడుతున్నారు. తీరా ఫోన్ నంబర్ లింక్ చేయటం, తదితర ఆన్‌లైన్ ప్రాసెస్‌లో కేంద్రాల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. నిత్యం గుంపులు గుంపులుగా కేంద్రాల వద్దకు జనం వస్తున్నప్పటికీ కొంతమందివి మాత్రమే అప్‌డేట్ చేసే పరిస్థితి ఉంటుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సైతం మండలకేంద్రంలో ఆధార్ కేంద్రం చెంత జనం పెద్దఎత్తున గుమిగూడారు. 54 గ్రామాలకు ఒకే ఆధార్ కేంద్రం ఉండడంతో ఇంకెనాళ్లు తిరగాలో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిడ్జిల్‌లో యూటీఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా జానకమ్మ, కోశాధికారిగా రవికుమార్, సభ్యులుగా బాల్‌రాజ్, కృష్ణవేణి, జయభాస్కర్, శ్రీనువాసులు, నాగేశ్వరి, వినోద్‌కుమార్, కృష్ణయ్య, రమేష్‌లు ఎన్నికైనట్లు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘నిధి ఆప్‌కే నిక్కట్’తో ప్రయోజనం


నిధి ఆప్‌కే నిక్కట్ కార్యక్రమంలో అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: నిధి ఆప్‌కే నిక్కట్–2.0 కార్యక్రమంతో ప్రావిడెండ్ ఫండ్ ఖాతాదారుల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవచ్చని మహబూబ్‌నగర్ పీఎఫ్ నోడల్ అధికారి మఠం రాజశేఖర్ అన్నారు. సోమవారం ఏనుగొండలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధి ఆప్‌కే నిక్కట్–2.0 కార్యక్రమం ద్వారా క్లెయిండ్ ఫైల్ చేయడం, సభ్యులు తమ ఖాతాలో నిల్వలు, ఈడీఎల్ఐ ఇన్సురెన్స్, జీవన్ ప్రమాణ్, సభ్యత్వం వలన పొందే ప్రయోజనాలను వివరించారు. సీనియర్ సోషియల్ సెక్యూరిటీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, రంజిత్‌తో పాటు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, అబ్దుల్ కరీం, మనోహర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కందూర్ ఆలయకమిటీ రాజీనామా


రాజీనామాలను సమర్పిస్తున్న సభ్యులు

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం పాలక మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. గత ప్రభుత్వ హయాంలో పాలక మండలి ఏర్పాటైన నేపథ్యంలో కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్‌తో పాటు సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి యాదవ్, నక్క రమేష్‌యాదవ్, భువనేశ్వరి, శ్రీశైలం, కొత్త లక్ష్మయ్య, రామకృష్ణలు సోమవారం తమ రాజీనామాలను ఆలయం వద్ద సీనియర్ అకౌంటెంట్ అనంతశర్మకు అందజేశారు. ఇన్నాళ్లు ఆలయాభివృద్ధికి సహకరించిన దాతలు, ఆలయ ఉద్యోగులు, అర్చకులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఆలయం బ్యాంకు ఖాతాలో ప్రస్తుతం రూ.25లక్షలు ఉన్నట్లు రమేష్‌గౌడ్ తెలిపారు. దాతల సాయంతో ఆలయాన్ని అభివృద్ధి దిశలో నడిపించినట్లు పేర్కొన్నారు.

కళాశాల విద్యార్థులకు క్రీడాపోటీలు



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 31వ తేదిన వార్షికోత్సవం నిర్వహించనున్న సందర్భంగా సోమవారం విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ విజేతలకు ఈనెల 31 బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

చెరువులు, కుంటలకు ఎఫ్‌టీల్ మార్కింగ్


రంగారెడ్డిగూడ శివారులోని పెద్దచెరువులో సర్వే చేస్తున్న అధికారులు

రాజాపూర్: రంగారెడ్డిగూడ శివారులోని పెద్దచెరువు, మైసమ్మకుంట, గొల్లోని కుంట, బంజర్‌కుంటతోపాటు చెన్నవెల్లి శివారులోని తుంగకుంట, రొప్పకుంట, కొత్తకుంటలకు ఇరిగేషన్ అధికారులు సోమవారం ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మార్కింగ్ ఇచ్చిన అనంతరం రెవెన్యూ అధికారులు సర్వే నంబర్‌లను బట్టి చెరువులు కుంటలు ఆక్రమణకు గురైనట్లు తేలితే స్వాధీనం చేసుకుంటారని ఇరిగేషన్ డీఈ మురళీధర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి సూచన మేరకు చర్యలు చేపట్టారు. ఏఈలు శశిధర్, శివుడు, సర్వేయర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల వద్ద సమస్యలు తీర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్ల వద్ద నెలకొన్న సమస్యలను తీర్చాలని స్థానిక ఎస్సీకాలనీకి చెందిన యువకులు డిమాండ్ చేశారు. సర్వీస్ రోడ్ల సమస్యలపై శాఖాపూర్ శివారులోని టోల్‌ప్లాజాలో అక్కడి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా సర్వీస్ రోడ్ల వద్ద లైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు యువకులు తెలిపారు. రెండేళ్ల నుంచి విద్యుత్ శాఖ, టోల్‌ప్లాజా అధికారుల మధ్య ఏర్పడిన వివాదం వల్ల తాము ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఫ్లైఓవర్ వద్ద మట్టిని తొలగించాలని కోరారు. సమస్యలు తీర్చకుంటే ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు, శేఖర్, సుదర్శన్, ప్రసాద్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అర్హులందరికీ ఇళ్లు, 120 గజాలు ఇళ్ల స్థలాలు కేటాయించి నిర్మాణం కోసం కేంద్రం రూ. 5 లక్షలు, రాష్ట్రం రూ. ఐదు లక్షలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. డబుల్ బెడ్ రూంలను నిజమైన లబ్ధిదారులకు పంచాలని కోరారు. కార్యక్రమంలో జహంగీర్, నగేష్, యాదయ్య, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. తాము స్వచ్ఛందంగా సర్వే నిర్వహించి 2వేలకు పైగా లబ్ధిదారులతో దరఖాస్తులు పెట్టించినట్లు వివరించారు. ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా జ్యోతిర్లింగాల మహాపడి పూజ



దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో సోమవారం జ్యోతిర్లింగాల మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. కుమ్మరి లక్ష్మీ, శివన్న ఆధ్వర్యంలో మఠం సురేష్ స్వామి పూజ నిర్వహింపజేశారు. శివ మాలాధారులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన చేశారు. కౌకుంట్ల, పుట్టపల్లి, రాజోలి, ఇస్రంపల్లి, వెంకటగిరి, పేరూర్, రాచాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గేదెల షెడ్డు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

భూత్పూర్: మద్దిగట్లలో ఎస్సీ కాలనీ వద్ద ఉన్న గేదెల షెడ్డును తొలగించాలని సోమవారం కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఓ వ్యక్తి కాలనీ సమీపంలో షెడ్డు వేసి 150పైగా గేదెలను పెంచుతున్నాడని.. దాంతో పక్కనే ఉన్న బావిలో గేదెల పేడ తదితర వ్యర్థాలను వదులుతున్నాడని ఆరోపించారు. ఈగలు, దోమలతో పాటు దుర్గంధం రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నట్లు వివరించారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు కురుమూర్తి, కిల్లె గోపాల్, మాణిక్యం రాజ్, సత్యం, రాములు, నాగయ్య, రవికుమార్, నరసింహా, రమేష్ రాములు తదితరులు ఉన్నారు.

యాక్షన్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

మిడ్జిల్: సబ్‌కా యోజన, సబ్‌కా వికాస్ యాక్షన్ ప్లాన్‌పై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొమ్మిది శాఖల నుంచి పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అందులో ప్రాధాన్యత ప్రకారం నిధుల మంజూరు ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, ఎంపీటీసీలు, డీటీ, ఎంఈఓ, ఏఓ, వైద్యాధికారిణి తదితరులు పాల్గొన్నారు.